క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పరకాల : పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ స్పష్టం చేశారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 13 వార్డుల్లోని సీఎస్ఐ కాలనీ, దళిత వాడల్లో సానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో సానిటేషన్ అధికారి ప్రశాంత్, జవాన్ కిషోర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



వేలేరు : మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ధర్మసాగర్ మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ వేలేరు మండల ఇన్‌చార్జ్ ఎం.రాజేశ్వర్‌రెడ్డి, పలువురి ముఖ్యనాయకులు చేరారు.

చెత్తను కాల్చకుండా చూడాలి

శాయంపేట : స్థానిక మహాత్మ జ్యోతిరావుపూలే, కస్తూర్బాగాంధీ, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంగణం బయట చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని పరకాల ఆర్డీఓ నారాయణ ఎంపీడీఓ ఫణిచంద్రను ఆదేశించారు. 'ఎంజేపీ సిబ్బంది నిర్వాకం' శీర్షికన సోమవారం కథనం ప్రచురితం కాగా తన దృష్టికి రావడంతో స్పందించిన ఆర్డీఓ పాఠశాల ప్రాంగణంలో చెత్తను పోసి కాల్చకుండా అధికారులు చూసుకోవాలని తెలిపారు. మరోసారి పాఠశాల ప్రాంగణంలో చెత్తను పోసి కాల్చితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫొటోగ్రాఫర్‌కు ఘననివాళి



నడికూడ : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ శనిగరపు శ్రీకాంత్ ఇటీవల మృతి చెందాడు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ సంఘం సభ్యులు శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో రవీందర్ రెడ్డి, భాస్కర్, కృష్ణ, రాజు.శ్రీను, అఖిల్, పాషా, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



అరుణ్(ఫైల్)

పరకాల: కేసముద్రం వద్ద వారం రోజుల క్రితం రైలు నుంచి జారి పడి తీవ్రగాయాలతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోగిల అరుణ్(22) మంగళవారం మృతి చెందాడు. పరకాలలో హమాలీ పని చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న శంకర్-రజిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అరుణ్ ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



కమలాపూర్ : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పఠనోత్సవం, లిఖితోత్సవం, గణితోత్సవం పేరిట పఠన, లేఖన, అంకగణిత పరీక్షలు నిర్వహించి ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు, ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మీస రాజమల్లయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు మల్లిక్, సునీత, వీరబ్రహ్మేంద్రచారి, భాస్కర్, రఘుపతి, జ్యోతి, సువర్ణ, పద్మ, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు షురూ!

- రూ.3.5 కోట్ల నిధులు మంజూరు
- అసంపూర్తి పనులు పునఃప్రారంభం
- ముస్తాబవుతున్న దామెర చెరువు ట్యాంక్‌బండ్



పరకాల దామెర చెరువు ట్యాంక్ బండ్ వద్ద ఆర్చీ నిర్మాణం



దామెర చెరువు

పరకాల : పరకాల మున్సిపాలిటీ సుందరీకరణలో భాగంగా పట్టణ ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం కోట్లాది రుపాయల నిధులు మంజూరైనా అసంపూర్తి పనులతో నిలిచిపోయిన దామెర చెరువు ట్యాంక్ బండ్ పనులు పునఃప్రారంభమయ్యాయి. ట్యాంక్ బండ్ నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో 5 ఏళ్ల క్రితమే రూ.3.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ ఆయా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదన్న కారణంతో మధ్యలోనే పనులు నిలిపివేశాడు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు రూ.80 లక్షల విలువ చేసే బోటు సదుపాయాన్ని ఏర్పాటు చేసినా వినియోగంలోకి తీసుకరాలేని పరిస్థితుల్లో ఇక్కడి నుంచి లక్నవరానికి తరలించారు. పరకాలలో అమరధామం సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు ట్యాంక్ బండ్ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించటానికి అవకాశం ఉంది. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ట్యాంక్‌బండ్ అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్న ఆదేశాలతో ట్యాంక్ బండ్‌పై ఆర్చి నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణపు పనులను వేగవంతం చేశారు. చెరువు కట్టపై దుర్గంధం వెదజల్లకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆదేశాలను దిక్కరించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. కొద్ది రోజులుగా ట్యాంక్ బండ్ పనులు వేగవంతం కావడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్త చేస్తున్నారు.

చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాలి



మున్సిపాలిటీ సుందరీకరించడం కోసం దామెర చెరువు ట్యాంక్ బండ్ నిర్మాణం చేయడం సంతోషదాయకం. పనులను మరింత వేగవంతం చేసి ట్యాంక్ బండ్ ప్రాంతంలో చిల్డ్రన్స్ పార్క్ కూడా ఏర్పాటు చేయాలి.

– ఆర్‌పీ సంగీత, మహిళామోర్చా నాయకురాలు

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

- ఐనవోలు మల్లన్న ఆలయంలో నిర్వహిస్తున్న అర్చకులు



అభిషేకంలో పాల్గొన్న ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, అర్చకులు

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మంగళవారం ప్రదోషకాల నందీశ్వరుడికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో రుద్రుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా స్వామి వారి కల్యాణం, రుద్రహోమం, ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేశారు. సాయంకాలం సూర్యాస్తమయం తర్వాత ప్రదోష కాలంలో శ్రీమల్లికార్జున స్వామి గర్భాలయానికి ఎదురుగా ప్రతిష్ఠితమైన నందీశ్వరుడిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. అనంతరం ఏక కాలంలో నందీశ్వరుడికి, గర్భాలయంలో రుద్రుడికి నక్షత్ర హారతి సమర్పణ కార్యక్రమం కన్నుల పండువగా జరిపించారు. అత్యంత విశేషమైన శక్తివంతమైన అభిషేకాల్లో ఒకటిగా చెబుతున్న ప్రదోష వేళ నందీశ్వర అభిషేకం రాష్ట్రంలో అతి కొద్ది శైవ క్షేత్రాల్లోనే జరుగుతున్నట్లుగా ముఖ్య అర్చకులు చెప్పారు. ఇలాంటి కార్యక్రమం మల్లన్న క్షేత్రంలో ప్రారంభమైందని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రతినెలా బహుళ పక్షంలో వచ్చే త్రయోదశి రోజు అభిషేకం జరుగుతుందన్నారు. సమస్యలతో ఇబ్బందులు పడుతున్న భక్తులు పాల్గొని తమ దోషాలు తొలగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు

- పరకాల ఆర్డీఓ నారాయణ



శాయంపేట : మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ



వేలేరు : మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



ధర్మసాగర్: మాట్లాడుతున్న హెచ్‌ఎం ధర్మప్రకాశ్

శాయంపేట : పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సమయం తక్కువ ఉన్నందున సమయాన్ని వృథా చేయకుండా బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని పరకాల ఆర్డీఓ నారాయణ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం ఉత్తీర్ణత, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు మండల స్థాయి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒక ప్రణాళిక తయారు చేసుకొని దాని ప్రకారం చదివి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ర్యాంకులు సాధించాలని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్న వేళలో సెల్‌ఫోన్లతో టైంపాస్ చేయవద్దని సమయాన్ని వృథా చేయకుండా చదవాలని తెలిపారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి

ధర్మసాగర్ : విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, క్రియాత్మక సంఖ్య, అక్షరాస్యతల ప్రాముఖ్యత చాలా ఉంటుందని కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాష్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటైన డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు, ఆంగ్ల భాష పఠనోత్సవం, లిఖితోత్సవం, గణితోత్సవం, ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. కాంప్లెక్స్ సహాయ కార్యదర్శి కే రవీందర్‌రెడ్డి సమన్వయకర్తగా నిర్వహించారు.

మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి

ఐనవోలు : విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా గుణాత్మక విద్య కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ పులి ఆనందం అధ్యక్షతన జరిగిన విద్యార్థులకు మండల స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా ఎలా చదవాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలి తదితర అంశాలపై ప్రముఖ సైకాలజిస్ట్ బరుపాటి గోపి విద్యార్థుల్లో ప్రేరణ నింపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సీనియర్ హెచ్‌ఎం రామకృష్ణ, మధుకర్, రమేష్, పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలి

వేలేరు : విద్యార్థులు ప్రణాళికబద్దంగా చదవాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ) శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం గురుకుల పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్‌ల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో ఓరియెంటేషన్ తరగతులను నిర్వహించారు. తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంఈఓ చంద్రమౌళి, ప్రిన్సి పాల్ అజయ్‌కుమార్, హెచ్‌ఎం రాజన్న పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

హన్మకొండ అర్బన్: జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని హనుమకొండ డీఆర్వో వైవీ గణేశ్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్‌సలీమా అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాల నియంత్రణకు సినిమా హాళ్లలో కూడా స్లైడ్స్ వేసే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కృష్ణతేజ మృతదేహం

పరకాల : పట్టణంలోని బ్రాహ్మణవాడకు వెళ్లే దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి 11 గంటలకు చోటు చేసుకుంది. వివరాలోకి వెళితే.. పరకాల పట్టణంలోని రజకవాడకు చెందిన వైనాల గోపాల్ పెద్ద కుమారుడు(దత్తపుత్రుడు) వైనాల కృష్ణతేజ(17) అతని స్నేహితుడితో కలిసి స్కూటీపై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయారు. సీసీ రోడ్డు మీద నుంచి డ్రెయినేజీ ప్రాంతానికి దూసుకెళ్లడంతో కృష్ణతేజ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో కృష్ణతేజ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు, సీఐ హరికృష్ణ

కమలాపూర్: ఈ నెల 27న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను సీఐ హరికృష్ణతో కలిసి ఎంపీడీఓ గుండె బాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి, పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. ఓటర్లకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, పిల్లలకు అందించే ఆహార పదార్థాలను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును వారు పరిశీలించారు.

ఎమ్మెల్సీలుగా బీసీ అభ్యర్థులను గెలిపించండి

- బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు శ్యామ్



కమలాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆశాజ్యోతి, బీసీ నాయకులు



వేలేరు : మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు రాజు

కమలాపూర్ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ కోరారు. మండలంలోని శ్రీరాములపల్లి, అంబాల, మాదన్నపేట, శనిగరం, ఉప్పల్, గూడూరు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని ఉపాధ్యాయులు, పట్టభద్రులను కోరారు. అదేవిధంగా సుందర్‌రాజ్ యాదవ్‌కు గెలిపించాలని ఆయన సతీమణి ఆశాజ్యోతి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు కత్తి రమేష్, నాయకులు పొరండ్ల తిరుపతి, మార్క అరవింద్ పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి

వేలేరు : ఉపాధ్యాయ సమస్యలపై ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న బీజేపీ బలపర్చిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజుయాదవ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఉపాధ్యాయులపై వ్యవహరించిన నిర్లక్ష్యం కారణంగా ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. 317 జీఓ రద్దుకు బీజేపీ పార్టీ అనేక ఉద్యమాలు చేసిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కీర్తి సురేష్, లోనే శివాజీ, కిరణ్ పాల్గొన్నారు.

కళాశాల.. సంతోష జ్ఞానశాల

- ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్



శాయంపేట : వార్షికోత్సవంలో పాట పాడుతున్న విద్యార్థినులు

ధర్మసాగర్ : జూనియర్ కళాశాల సంతోష జ్ఞానశాల అని, అది అమ్మ ఒడి లా ఆదరించి విద్యార్థుల వికాసం కోసం అన్నింటినీ సమకూర్చే అక్షయపాత్ర అని ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జ్ఞానోత్సవ్ పేరుతో వార్షిక వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా మూడు వేల మంది విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దిన వైభవ చరిత్ర కళాశాలకు ఉందన్నారు. స్టాఫ్ సమష్టి కృషి అదనపు గంటల బోధన విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల పట్టింపు వరంగల్ ఎంపీ కడియం కావ్య విద్యార్థుల అవసరాలను తీర్చడానికి ఇచ్చిన సహకారంతో కళాశాల మెరుగైన ఫలితాలను సాధించిందని అన్నారు. ఈ మేరకు క్విజ్, ఆటల్లో గె లుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా వీడ్కోలు పొందుతున్న ద్వితీయ సంవత్సర విద్యార్థులు తమ అనుభూతులను పంచుకున్నారు. తమకు మంచి విద్యతో పాటు పుస్తకాలు, మెటీరియల్, దుస్తులు, హెల్త్ కిట్స్, పరీక్ష ఫీజులు అన్నీ అందించిన ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

శాయంపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఒత్తిడి లేకుండా వార్షిక పరీక్షలకు రోజుకు 8 గంటలు చదివి మంచి ర్యాంకులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు. విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు బందోబస్తు

- పరకాల ఆర్డీఓ నారాయణ, ఏసీపీ సతీష్ బాబు



పరకాల : ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీఓ డాక్టర్ నారాయణ, ఏసీపీ సతీష్‌బాబు

పరకాల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లతో పాటు బందోబస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఏర్పాట్ల గురించి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావును అడిగి తెలుసుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్ పాటించే చర్యలు తీసుకోవాలని సీఐ క్రాంతికుమార్‌ను ఆదేశించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ధర్మకర్తలు ఉన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన శివాలయాలు

దామెర : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జరిగే శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక దామేశ్వరాలయం, ఊరుగొండలోని భవానిరామలింగేశ్వర స్వామి ఆలయం, ల్యాదెళ్ల, ముస్త్యాలపల్లి శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా దామేశ్వరాలయం శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు దామేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించి రాత్రి 11.45 గంటలకు పంచామృత అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు రమణారెడ్డి తెలిపారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహిమాన్విత పంచకూట శివాలయంలో నేడు (బుధవారం) మహాశివరాత్రి వేడుకల నిర్వహణకు ఆలయం ముస్తాబైంది. ఆలయంలో ఉదయం నుంచి అభిషేకా లు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంద ని తెలిపారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ని ర్వహిస్తామని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, అర్చకులు రవిందర్ శర్మ కోరారు.

నేడు కైలాస కల్యాణి క్షేత్రంలో వేడుకలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం వంగరలోని కైలాస కల్యాణి క్షేత్రంలో నేడు(బుధవారం) మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దివంగత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు సోదరుడు పీవీ మనోహర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఉదయం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేక కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. సుమారు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మంత్రి రాక...


వంగర గ్రామంలోని కై లాస కల్యాణి క్షేత్రంలో బుధవారం జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభాకర్‌రావు కోరారు.

'ఓఆర్ఎస్' అందుబాటులో ఉంచాలి

- వేసవి నుంచి రక్షణకు ఏర్పాట్లు చేయండి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: రానున్న వేసవి దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు ప్రజలను వడగాలుల నుంచి అప్రమత్తం చేయడంతోపాటు వేసవి నుంచి రక్షణకు ఏర్పాట్లు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై ఆయా శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఉపాధి హామీ పనుల ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పరిశ్రమల వద్ద, నగరంలోని రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ సూత్రాలను తెలిపే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వడగాలుల నుంచి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న దామోదర్

ఐనవోలు : విద్యార్థులు జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. మంగళవారం మండలంలోని పున్నేలు ఏకశిల ఈ టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇతరులతో విధానం, సృజనాత్మకత, ఆలోచన, సమయస్ఫూర్తి వంటి జీ వన నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. సీని యర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడా విలువైన సమయాన్ని సెల్‌ఫోన్‌తో వృథా చేయకుండా కుటుంబంతో గడపాలన్నారు. ఎంఈఓ ఆనందం, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వెస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.